ఫిబ్రవరి 12 నుంచి మినీ మేడారం జాతర

తాడ్వాయి, అక్టోబర్ 26 : వచ్చే ఫిబ్రవరి 12 నుంచి మినీ మేడారం జాతర నిర్వహించనున్నట్టు పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు తెలిపారు. పూజారుల సంఘం ఆధ్వర్యంలో సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల పూజారులు అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో శనివారం సమావేశమయ్యారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం మినీ జాతర తేదీలపై పెద్దలతో కలిసి చర్చించారు. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు నాలుగు రోజుల పాటు మినీ జాతరను నిర్వహించాలని నిర్ణయించారు. మినీ జాతర (మండె మెలిగే పండగను) పురస్కరించుకొని అమ్మవార్లను గద్దెలపైకి తీసుకురావడం మినహా మిగతా అంతా మహాజాతర మాదిరిగా నిర్వహించనున్నారు.

మైనింగ్ అధికారులకు జరిమానా

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): విధి నిర్వహణలో అలసత్వం, అవకతవకలకు పాల్పడిన గనుల శాఖకు చెందిన పూర్వ సంయుక్త సంచాలకుడు కే లక్ష్మణ్‌బాబు, ఉప సంచాలకుడు కే నర్సింహారెడ్డి, సహాయసంచాలకుడు ఆర్ ప్రవీణ్, ఎస్ సైదులు, జీ నిరంజన్‌పై రాష్ట్ర సివిల్ సర్వీసెస్ నిబంధనలు-1991 ప్రకారం క్రమశిక్షణాచర్యలతోపాటు జరిమానా విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

2 నుంచి శ్రీశైలానికి లాంచీ ప్రయాణం

నందికొండ, అక్టోబర్ 26 : నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణాన్ని నవంబర్ 2 నుంచి ప్రారంభిస్తున్నట్టు పర్యాటక అభివృద్ధి సంస్థ, వాటర్ ఫీడ్ జీఎం ఇబ్రహీం శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీ ప్రయాణం ఉంటుందని పేర్కొన్నారు. వన్‌వేకు పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600, రానుపోను పెద్దలకు రూ.3వేలు, పిల్లలకు రూ.2,400 చొప్పున చార్జీ వసూలు చేస్తున్నట్టు తెలిపారు. వివరాలకు 9848540371, 9848125872 0, 7997951023 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆస్తులు కాపాడుకోడానికే కాంగ్రెస్‌లోకి

- రాజకీయ భవిష్యత్తు కోసమే ఎమ్మెల్యేల చేరికలు
- గంగారెడ్డి హత్యపై నిష్పక్షపాత విచారణ జరగాలి
- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్
- ఫిరాయింపులతో క్యాడర్ ఆత్మస్థైర్యం కోల్పోయింది
- కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆవేదన



జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్. పక్కన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్

జగిత్యాల రూరల్, అక్టోబర్ 26: అక్రమంగా కూడబెట్టిన ఆస్తులను కాపాడుకునేందుకు, రాజకీయ భవిష్యత్తు కోసమే ఇతర పార్టీల ఎమ్మెల్యేలు అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరుతున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తెలిపారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అనుచరుడు జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మారు గంగారెడ్డి (58) ఇటీవల దారుణ హత్యకు గురి కాగా శనివారం ఆయన భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లను మధుయాష్కీగౌడ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్‌తో కలిసి గంగారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మీడియాతో మాట్లాడుతూ.. పార్టీలో కొత్తగా చేరిన వారి అనుచరులకు నామినేటేడ్ పోస్టులు ఇస్తామని ఏ హామీ ఇవ్వలేదని స్పష్టంచేశారు. జగిత్యాల పోలీసుల నిర్లక్ష్యంతోనే గంగారెడ్డి హత్య జరిగిందని, ఆయన హత్యకు గురికావడం బాధాకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి, కాంగ్రెస్ నాయకులు హత్యకు గురికావడం దురదృష్టకరమని వాపోయారు. ఎవరి ప్రోద్బలం, ఎవరి అండతో పోలీసులు ఇలా వ్యవహరిస్తున్నారో తెలియాలని, గంగారెడ్డి హత్యపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫిరాయింపులతో కాంగ్రెస్ క్యాడర్ అంతా ఆత్మస్థైర్యం కోల్పోయిందని వాపోయారు. గంగారెడ్డి హత్యలో పోలీసుల నిర్లక్ష్యం ఉందని, ఆయనను వాట్సాప్‌లో బెదిరించినా జగిత్యాల పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. డయల్ 100కు ఫోన్ చేసినా పోలీసుల నుంచి రెస్పాన్స్ రాలేదని చెప్పారు. దసరా పండుగ రోజున డీజేలు పగులగొట్టినా పట్టించుకోలేదని, కుట్రలు, వాస్తవాలను వెలికితీయకుండానే పాతకక్షలు అని పోలీసులు చెప్తున్నారని, ఓ నేరస్థుడు పోలీస్ స్టేషన్‌లో రీల్స్ చేసినా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ఉన్నతాధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో సమావేశమైన అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు

అక్రెడిటేషన్ మార్గదర్శకాలపై సలహాలివ్వండి

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): జర్నలిస్టుల అక్రెడిటేషన్ విధివిధానాలు, మార్గదర్శకాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి జర్నలిస్టు యూనియన్లు, ప్రెస్‌క్లబ్‌ల బాధ్యులు, సీనియర్ జర్నలిస్టులను కోరారు. నవంబర్ 15లోగా సమాచార, పౌరసంబంధాలశాఖ. జాయింట్ డైరెక్టర్‌కు రాతపూర్వకంగా సమర్పించాలని విజ్ఞప్తిచేశారు. శనివారం ప్రత్యేక కమిటీ తొలి సమావేశాన్ని హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో నిర్వహించారు.

సెక్స్ వర్కర్ల హక్కులపై సదస్సు

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో శనివారం తెలంగాణ స్టేట్ లెవల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సహకారం సాధి స్వచ్ఛంద సంస్థతో కలిసి 'సెక్స్ వర్కర్ల హక్కులు'పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుజోయ్‌పాల్ ప్రారంభించారు.

ముక్తీశ్వర స్వామి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

హైకోర్టు న్యాయమూర్తి బీవీ వేణుగోపాల్ శనివారం కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి కాళేశ్వరం దేవస్థానానికి రాగా, అర్చకులు, వేద పండితులు రరాజగోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ముక్తీశ్వర స్వామికి అభిషేకాలు చేసి, శుభానంద అమ్మవారి దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో న్యామూర్తి దంపతులను అధికారులు స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించారు. – కాళేశ్వరం

ఇరిగేషన్‌శాఖలో ఔట్‌సోర్సింగ్ నియామకాలు

హైదరాబాద్, అక్టోబర్26 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్‌శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 1597 మంది లష్కర్లు, 281 మంది హెల్పర్ల నియామకానికి ఆమోదం తెలుపుతూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఈఎన్‌సీ లేదంటే, చీఫ్ ఇంజినీర్ చైర్మన్‌గా, ఎస్ఈ, డీఈఈలు సభ్యులుగా ఆ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. లష్కర్లు, హెల్పర్లకు నెలకు రూ.15,600 గౌరవ వేతనమివ్వాలని భావిస్తున్నట్టు సమాచారం.

డాటా ఇంటర్‌ప్రిటేషన్‌లో కఠినంగా ప్రశ్నలు

- సమాధానాలు రాబట్టేందుకు భారీగా కష్టపడ్డ అభ్యర్థులు
- యూపీఎస్సీలోనూ ఇలాంటి ప్రశ్నలను చూడలేదన్న అభ్యర్థులు
- గ్రూప్-1 ఎంపికపై ప్రభావం
- కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డ మరో అభ్యర్థి

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ ప్రశ్నలు అభ్యర్థులకు చుక్కలు చూపించాయి. ప్రశ్నలు అత్యంత కఠినంగా ఉండడంతోపాటు చాలా పొడవుగా ఉండగా, సమాధానాలు రాబట్టేందుకు అభ్యర్థులు కష్టపడాల్సి వచ్చింది. ఒక్కో ప్రశ్న సాధనకు 2-3 నిమిషాలు పట్టింది. అయినా కొన్ని ప్రశ్నలకు అభ్యర్థులు సమాధానాలు రాబట్టలేకపోయారు. దీంతో తమ విలువైన సమయాన్ని కోల్పోవాల్సి వచ్చిందని అభ్యర్థులు వాపోయారు. ఈ విభాగంలో 30 ప్రశ్నలకు 25 ప్రశ్నలు రెండు మార్కులకు సంబంధించినవి అడిగారు. ఈ ప్రశ్నలకు ఆన్సర్లు రాసేందుకు గణితం సబ్జెక్టు అభ్యర్థులు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పేపర్ ప్రభావం గ్రూప్-1 ఎంపికపై పడుతుందని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు జరిగిన పరీక్షల్లో శుక్రవారం నాటి పేపరే అత్యంత కఠినంగా వచ్చిందని అభ్యర్థులు చెప్పారు. యూపీఎస్సీలోనూ ఇలాంటి ప్రశ్నలను తానెప్పుడూ చూడలేదని ఓ అభ్యర్థి వాపోయాడు. శనివారం షేక్‌పేటలోని నారాయణమ్మ ఇంజినీరింగ్ కాలేజీలో ఓ అభ్యర్థి కాపీయింగ్‌కు పాల్పడగా అధికారులు ఆ అభ్యర్థిని డిబార్‌చేశారు. పరీక్షకు 31,383 మందికి 21,181(67.4)శాతం అభ్యర్థులు హాజరైనట్టు టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు.

ఇద్దరితో మెయిన్స్ మూల్యాంకనం

- అభ్యర్థులకు సగటు మార్కులు
- నేటితో ముగియన్న మెయిన్స్ పరీక్షలు

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : గ్రూప్ -1 జవాబు పత్రాల మూల్యాంకనంపై టీజీపీఎస్సీ కీలక నిర్ణయం తీసుకున్నది. ఒక జవాబుపత్రాన్ని ఇద్దరు ప్రొఫెసర్లతో మూల్యాంకనం చేయించనుంది. ఇద్దరు వేసిన మార్కులను పరిగణనలోకి తీసుకుని సరాసరిగా మార్కులేసి ఫలితాలను ప్రకటిస్తారు. ఇద్దరు ప్రొఫెసర్లు వేసిన మార్కుల్లో భారీతేడా లుంటే మూడో ప్రొఫెసర్‌తో మూల్యాంకనం చేయిస్తారు. అయితే మూల్యాకనానికి టీజీపీఎస్సీ పలు జాగ్రత్తలు తీసుకుంటున్నది. ఒకే ఆన్సర్‌షీట్‌ను ఇద్దరు ప్రొఫెసర్లు దిద్దాల్సి ఉండటంతో ఆన్సర్‌షీట్లపై మార్కులు వేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆన్సర్‌షీట్లపై మార్కులేస్తే మరో ప్రొఫెసర్ ప్రభావితమయ్యే అవకాశముండటంతో మూల్యాంకన సమయంలో ప్రొఫెసర్లకు రెండు వేర్వేరు ఓఎమ్మార్ షీట్లు ఇస్తారు. ఈ ఓఎమ్మార్‌షీట్‌పై ప్రశ్న నెంబర్ ఉంటుంది. ఈ నెంబర్ పక్కన అభ్యర్థికొచ్చిన మార్కులను వేయాల్సి ఉంటుంది. ఆయా మార్కులను కంప్యూటర్‌లో నిక్షిప్తంచేస్తారు. ఆ తర్వాత సగటు మార్కులను లెక్కించి అభ్యర్థులకు వేస్తారు. మెయిన్స్ పరీక్షలు ఆదివారం జరుగనున్న పేపర్-6 తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్ పేపర్‌కు పరీక్షతో ముగియనున్నాయి. గ్రూప్ -1 పరీక్షలు 21 నుంచి ప్రారంభమయ్యాయి. పరీక్ష ముగిసిన తర్వాత ఏ రోజు ఆన్సర్‌షీట్లను ఆ రోజే స్కాన్ చేస్తున్నారు. జవాబుపత్రాలు ధ్వంసమైనా, నీళ్లుపడిన చెరిగిపోకుండా ఆన్సర్‌షీట్లను స్కాన్‌చేస్తున్నారు. ఇప్పటికే జవాబుపత్రాల మూల్యాంకనాన్ని టీజీపీఎస్సీ ప్రారంభించింది. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో అభ్యర్థులు ఆన్సర్లు రాయగా, ఈ మూడు భాషల్లో నిష్ణాతులైన ప్రొఫెసర్లను మూల్యాంకనం కోసం ఇప్పటికే ఎంపికచేశారు.

నిధుల దుర్వినియోగం జరగలేదు

ఐసెట్ కన్వీనర్ నరసింహాచారి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 26: కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఐసెట్-2024లో నిధుల దుర్వినియోగం జరగలేదని ఐసెట్ కన్వీనర్, కామర్స్ ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. శనివారం మాట్లాడుతూ.. ఐసెట్ నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగలేదని నిజనిర్ధారణ కోసం విచారణకు తాను సిద్ధంగా నే ఉన్నట్టు తెలిపారు.